ఇదోరకం పాతివ్రత్యం

గుబ్బల భాస్కరరావు

ఆ రోజే ఫస్టు.

నెల మొదటిరోజు.

స్టేట్ బాంక్ కిటకిట లాడిపోతూంది. కరెన్సీనోట్ల లెక్కింపు రెపరెపలతో టకటకమనే ముద్రల శబ్దాలతో కీకర కాకర కబుర్లతో బాంకు నిండిపోయింది. ముఖ్యంగా గవర్నమెంటు ఆఫీసులు జీతాల చెక్కులు మార్చుకుంటున్నాయి.

బాంకు సన్‌గ్లాసు కౌంటర్ మీద- ఆఫీసు ప్యూన్ గురవయ్య సాయంతో ఐదువేలు ఒకటికి పదిసార్లు లెక్కపెట్టుకొని ఆఫీసు కాష్‌బాగ్ అనబడే నల్లటి తోలుసంచిలో భద్రంగా ఉంచి బెల్టు బిగించి — బైటపడ్డాడు హెడ్ క్లర్కు సర్వేశలింగం.

కరెంటు కొరతవల్ల ఉక్కలోంచి జన ప్రవాహంలోంచి-దాదాపు చీకట్లోంచి బైటపడ్డ సర్వేశలింగానికి బైటగాలి పైరుగాలిలా తలిగి హాయిమనిపించింది. తన హస్తగతం కాబోతున్న ఆఫీసు

కాష్ ఐనవేలు– అతని హాయికి మరో కారణమయింది.

సరాసరి బస్‌స్టాండుకు వెళ్ళి రూట్ బస్ అందుకుంటే సరిగ్గా అరగంట ప్రయాణం– సైట్ చేరుకోడానికి. సైట్‌లో పన్నెండుమంది సబ్ డివిజన్ సిబ్బంది తనకోసం తను తెచ్చే జీతాల కోసం ఆంగలారుస్తూ ఎదురుచూస్తూం టారు. ఫస్టు తారీఖున వాళ్ళు పని చెయ్యరు. జీతాలకోసం ఎదురు చూడ్డంతో– తీరా పుచ్చుకున్నాక పప్పు బెల్లాలా ఊరిమీద పంచిపెట్టడంతో ఆ రోజు సరి. ముప్పై రోజులు పడి గాపులు పడ్డవాళ్ళు ఆరోజు ఏమాత్రం ఆలస్యం భరించలేరు. అవి జీతాలు కావు. నెలరోజుల హాహాకారాలు. ఆర్తనాదాలు.

సర్వేశలింగం బాంకు దాటి వడివడిగా అడుగులేసాడు. అతని అడుగుల్లో అడుగులు వేస్తూ ఫ్యూన్ గురవయ్య అనుసరించాడు. 'పీడాకడు మధ్య' అనిపించింది. భద్రతకోసం రక్షణకోసం తనని గురవయ్య ఎస్కార్టు చేస్తుంటే– సర్వేశలింగానికి తనమీద నిఘాకోసం వేసిన సి ఐ డి పోలీసులా అనిపి స్తుంటాడు.

బస్‌స్టాండు చేరుకోవాలంటే యిలాంటి నడక యింకా పదినిమిషాలు సాగించాలి. నిజానికి రిక్షా అలవెన్సు చెరో రూపాయి ముడుతుంది. కానీ దాన్ని కడుపున కట్టి కాళ్ళకి బుద్ధిచెప్పి బస్‌స్టాండు చేరుకోడం అలవాటు.

బాగ్ బరువులేకపోయినా సర్వేశ లింగం ప్రతి నిమిషానికి చేతులు మార్చు కున్నాడు. నడుస్తున్నాడన్న మాటే గానీ దృష్టి గురవయ్యమీదే ఉంది

ఆఫీసు సిబ్బంది జీతాల సొమ్ము అతి లాఘవంగా కాజెయ్యాలని సర్వేశ లింగం కొంతకాలంగా కలలు కంటూ వచ్చాడు. అందుకోసం అతని ఆలో చనల్లో ఒక ప్రణాళిక సిద్ధంగా ఉంది. పరులకి తెలియనిది ప్రమాదం లేనిది అదేనని అతని నమ్మకం.

పారని ఈ పథకాన్ని ప్రతి ఫస్టుకీ జీతాలు డ్రా చేసినప్పుడల్లా పాటిస్తూ వచ్చాడు. యిన్నాళ్ళూ అది ఫలించ లేదు. ఏనాటికో ఒకనాటికి అది పారి తీరుతుందని డబ్బు తన పరమౌతుందని అతని విశ్వాసం.

ఈ పథకానికి పట్టుకొమ్మ – ఆ వూరి బస్‌స్టాండు. ఆంధ్రదేశంలోకెల్లా— ఛాలెంజీ దొంగతనాల బస్‌స్టాండుగా పేరు పొందింది. పాసింజర్లు బస్సెక్కే ముందు నిండు జేబులతో ఉన్నవాళ్ళు – తీరా బస్సెక్కింతరవాత ఏనుగు ఊదిన వెలగపళ్ళలా ఖాళీ అయికూర్చుంటారు. అంత పకడ్బందీగా జరుగుతాయి దొంగతనాలు.

తనెరిగిన కేసుల్లో ఒకావిడ వడ్డాణం చిత్రంగా కత్తిరించబడింది. చంకలో

ఉన్న పపిపాప సిగ్గు బిళ్ళ స్థానభ్రంశ మయింది. మరొకాయన బనీను లోపలి జేబులో ఉంచిన మూడువేల కాష్ హుష్‌కాకీ అయిపోయింది. ఉంగరాలు, వాచీలు, గాజులు, మంగళసూత్రాలు చంద్రహారాలు, చేతిసంచులు సూట్ కేసులు – ఎన్నో – ఎన్నెన్నో-రెక్కలొచ్చి ఎగిరిపోయాయి

తన ప్లాను ప్రకారం గురవయ్యను ఏమార్చి దార్లో కాష్‌బాగ్‌లో నోట్లకట్టలు తీసి పాంటుజేబులో కుక్కుతాడు. చంకలో ఖాళీ బాగ్ ఉంటుంది. గురవయ్య దృష్టిలో అది ఖాళీదికాదు. కాష్ ఉన్న బాగ్.

బస్టాండ్లో-బస్సు వచ్చిరావడంతోటే దానికోసం తనూ, గురవయ్యా ఎగబడ తారు మామూలుగా జనం తేనెటీగల్లా ముసురుతారు. ఒకర్నొకరు కుమ్ముకుంటారు. తోసుకుంటారు తొక్కుకుంటారు.

ఈ సందట్లో మామూలుగా జరగబోయే దొంగతనాల్లో తన కాష్ బాగ్ ఒకటి. ఖాళీ బాగ్ కృష్ణార్పణం అవుతుంది. తను దిక్కులు పిక్కటిల్లేలా కేకలువేస్తాడు. 'బాగ్ బాబోయ్ నా కాష్ బాగ్. ఆఫీసు డబ్బు ఐదువేలు బాబోయ్' అని గొంతు చించుకుంటాడు.

యింకెక్కడ కాష్ బాగ్? అది కొట్టేసినవాడు సామాన్యుడా! ఖిలాడుడు. మహావేధావి. ఒంటిమీద స్పృహ ఉన్న స్త్రీ వడ్డాణం కొట్టినవాడూ చంటిపిల్ల సిగ్గుబిళ్ళ ఎగరేసుకుపోయినవాడూ నిండు చూలాల్లాంటి జేబుల్ని రహస్యంగా తొలిచి అబార్షన్ చేయించగలవాడూ - అపార ప్రజ్ఞాశాలి ఆ కాష్‌బాగ్ పట్టుకు వెళ్ళాడ తాడా? అంత తెలివి తక్కువవాడా? జనం గోలచేసేలోగా చేతులు మార్చి తీసుకుపోడూ?... పాపం బీద వెధవ! అది ఖాళీ బాగ్ అని తెలిసి షాక్ తిన దానికి కొంత టైంపడుతుంది. అదలా ఉంచితే- పదిలంగా పాంటుజేబులో దాచుకున్న నోట్లకట్టలు తన సొంత మవుతాయి. గురవయ్య–బస్టాండులో జనం సాయంతో సానుభూతి వాక్యాలతో సాక్ష్యాధారాలతో ఎటూ తేలని పోలీసు కేసై తనకి కొండంత రక్షణ కల్పిస్తుంది.

కొంచెం లోతుకి పోతే ఒక అనుమానం కలుక్కుమనేది ఒకవేళ పోలీసులు తనని సోదాచేస్తే – సొమ్ము పాంటు జేబులో దొరికితే – తన గతి? అదా? అసలు ఖాళీ కాష్ బాగ్ దొంగతనం జరగాలే గానీ – డబ్బు ఏదో విధంగా గస్మెన్ చెయ్యవచ్చు. ఇదీ పథకం

కానీ ఏమిటి ప్రయోజనం?

తు చ. తప్పకుండా పది నెలల్నుంచి పాటిస్తూ వస్తాడు. దొంగ వెధవలు! ఒక్కడు – ఒక్కడు కూడా



తన బాగ్ జోలికి రావడంలేదు అక్కడికీ బస్‌కోసం వేచి ఉన్నంత సేపూ బాగ్‌లో ఎంతో డబ్బున్నట్టూ దాన్ని ప్రాణప్రదంగా చూసుకుంటు న్నట్టు ప్రవర్తిస్తున్నాడు వర్రైనా ఖాతా ఖాళీలోకి చెంపితే మాటల్లో బాగ్‌లో కాష్ ఉన్నట్టు. అది పోతే తన ఉద్యోగం ఖాళీ అని అందరికీ వినబడేలా చెబుతూ వచ్చాడు.

"సార్"

తక్కున ఆగిపోయాడు సర్వేశ లింగం

వెనక గురవయ్య నోట్లో వేలుంచు కొని 'చిన్న విన్నపం' అన్నట్టు వాలకంతో నిలబడ్డాడు

"ఏమిటోయ్"

"కొత్తపేటలో మా బావమరిదిని కలుసుకొస్తా సార్."

సర్వేశలింగానికి ఒళ్ళు పులకించింది. దాన్ని కప్పిపుచ్చుకొని "నిన్ను నా కూడా పంపేది ఎందుకు? అటూ యిటూ తిరిగి నీ పనులు చూసుకో డానికా? ఈ డబ్బు పోతే నా దెంత బాధ్యతో నీదీ అంతే. తెలుసా?" అన్నాడు.

"నాకు తెలీదా సార్? ఒకేళ మీ యంతట మీరు మింగేసినా - నేనూ ములుగుతాకద సార్" అన్నాడు నవ్వుతూ.

ఓరి వీడి తెలివి తూట్లుపడా. ఎంత మాట అనేశాడు వెర్రిబాగుల వెధవ.

"సరి సరి. మరి త్వరగా వచ్చె య్యాలి సుమా ఆలస్యం అయితే బస్సు దాటిపోతూంది."

"ఎంత సార్? సిటికెలో వస్తా

తవరు స్టాండింగ్‌లో ఉండండి." అని అడ్డదారి అందుకున్నాడు గురవయ్య.

చక్కటి రిలీఫ్ చిక్కి సర్వేశలింగం జేబురుమాలుతో ఒక రౌండు మొహం తుడుచుకున్నాడు. అటు యిటు చూసి హుషారుగా 'ఏయ్ రిక్షా' అని అరిచాడు అందుబాటులో ఉన్న రిక్షా ఒకటి ఆత్రంగా ముందుకొచ్చింది. ఎక్కి 'బస్‌స్టాండుకి పోనియ్' అని ధీమాగా వెనక్కి వాలాడు. రిక్షా కదిలింది.

కాష్ బాగ్ విప్పి నోట్ల కట్టల్ని పరిశీలించాడు. తళతళలాడే సరికొత్త నోట్లు. అపుడే వెచ్చగా ప్రెస్‌లోంచి వెలువడ్డాయనిపించే నోట్లు.

అంతా పోగుజేసి ఐదువేలు. ఈ రోజుల్లో యిదో పెద్ద మొత్తం కాదు – చెప్పుకోతగ్గ దొంగతనం కాదు. కీలకమైనవాళ్ళు కుంభస్థలాలు కొడ్తున్న ఈ కాలంలో లక్షలు లక్షలు దోచేసి దాచేసుకుంటూ దీపం ఉండగానే యిల్లు చక్కపెట్టుకుంటున్న వాతావరణంలో– తను ఏ అవకాశాలు లేక వెలవెలపోతూ–అనుభవించేవాళ్ళని తల్చుకొని కడుపు మాడిపోతూన్న మామూలు హెడ్ గుమాస్తా.

ఆఫీసు ఎకౌంట్లలో దొంగరాతలకి విశృంఖలంగా జరిగే శుభకోణాలకి – తను గుటకలు మింగుతూ పాస్ ఆర్డర్లు వేస్తూ సంతకాలకి పుటప్‌చేస్తూ ఎంత సొమ్ము ఆఫీసరు జేబు చేరుతుందో అంచనా వేస్తుంటే ... ఒళ్ళు జలదరిస్తుంది. ఇదీ ఒక జీవితమేనా అనిపిస్తుంది–తన స్థితి గుర్తొచ్చి.

కంట్రాక్టర్ల కొలువులో – పై అధికార్ల అండదండలతో – పైపై అధికార్ల ఆశీర్వచనాలతో ఆఫీసర్ జతిపే బాగోతాలు, జేబులు నింపుకొనే వేషాలు – విందులు, వినోదాలు, విలాసాలు – అనుభవం మాట అటుంచి తన ఊహకందనివి. పాయసం పోసిన పళ్లెంలాంటి డిపార్టుమెంటులో – తనది కొంగ పాత్ర. పాయసం అందదు. అందుకోనేవాళ్లని చూసి గుండెలు బాదుకుని 'లంబోదరా! మాలాంటి వాళ్ళకి జీవితంలో ఛాన్సులే ఉండవా. ఒక్కరోజైనా అటువంటి వైభవం ప్రసాదించవా' అని భోరుమని విలపించేవాడు.

ఆ తిళ్ళు – తాగుళ్ళు – తిరుగుళ్ళు తుళ్ళింతలు – చూస్తూ సర్వేశలింగానికి అనిపించేది–ఒక ఫైన్ మార్నింగ్ ఆఫీసు సొమ్ము కాజేసి జీవితంలో ఒకసారి ఝుంఝుం చెయ్యాలని. డబ్బులు పుచ్చుకొని పరారీ అవ్వడం తన ఉద్దేశ్యం కాదు. అది ఉద్యోగానికే ఎసరు పెడుతుంది. అందుకే...ఈ ప్రణాళిక...

సర్వేశలింగం నోట్లకట్టలమీద జేబురుమాలుకప్పి ఎవరూ చూడకుండా పాంటు జేబులో కుక్కుకున్నాడు. మళ్లీ మామూలుగా బాగ్ బిగించేసాడు.

ఒక్క క్షణం కళ్ళుమూసుకొని యిష్ట దైవమైన ఒక 'బాబా'ని ఆత్మస్థైర్యం ప్రసాదించమని వేడుకున్నాడు.

రిక్షా బస్‌స్టాండు చేరింది. జేబులోంచి సర్రున ఒక రూపాయి తీసి రిక్షావాడి మొహంమీద పారేసి 'మిగిలిన చిల్లర యివ్వనక్కర్లే' దన్నట్లు తలఊపి దిగాడు. రిక్షావాడు రూపాయి కళ్ళకద్దుకొని వెళ్ళిపోయాడు.

బస్‌స్టాండు ఎక్కడ్నలేని జనంతో ఒకటే రొదగా ఉంది. 'వీళ్ళంతా పాసింజర్లే?' అని ఆశ్చర్యపోయి 'కాదు, సగంమంది దొంగలు' అని సరిపెట్టుకున్నాడు. ఖాళీ కాష్ బాగ్ తస్కరించి తనకో కొత్త వెలుగు ప్రసాదించే మహానుభావుడున్నాడు వీళ్ళలో' అని భావించాడు.

సైట్‌లో ఆఫీసు సిబ్బంది జీతాల మీద మమకారాలు పెంచుకొని ఎదురు చూస్తున్న దృశ్యం అతని కళ్లముందు

కదిలింది. యింకెక్కడి జీతాలు. ఈ నెలకి అందుకో నోచుకోలేని వాళ్లు.

అరగంటలో గురవయ్య తయారయ్యాడు తన బావమరదితో. "ఈ రేరా అయ్యగారు. నమస్కారం చెయ్" అన్నాడు. అతను సర్వేశలింగానికి వంకర టింకర పళ్లతో మర్యాదపూర్వకమైన నవ్వు వెలిబుచ్చి దణ్ణం పెట్టాడు. సర్వేశలింగం దర్జాగా నమస్కారం అందుకుని "ఏమయ్యా ఏంచేస్తున్నావ్" అన్నాడు.

"యదవ. గాలికి తిరుగుతున్నాడండి. అందుకే మీ దగ్గరకి తీసుకొచ్చానండి. ఎలాగైనాసరే తమరు పెద్దయ్యగారికి సెప్పి సైట్లో పనేయించాలి సార్. మీ పేరు సెప్పుకుని బతుకుతాడు," అన్నాడు గురవయ్య.

" అదెంతమాట ! చూద్దాంలే " అన్నాడు 'అదెంత పని' అనలేని సర్వేశలింగం.

ఉన్నట్టుండి బస్సు రివ్వుమని వచ్చి స్టాండులో ఆగడంతో సంభాషణ తెగిపోయింది. సన్నివేశం మారిపోయింది.

జనం హెలోమని ఎగబడి — ఊరు విడిచి భయంతో పారిపోతున్న వాళ్లలా పరుగెత్తి బస్సుద్వారాని కడ్డంపడ్డారు. రెట్టింపయిన ఉత్సాహంతో సర్వేశలింగం బాగ్ పుచ్చుకొని జనంలో ఉగబడిపోయాడు. 'దబ్బు జాగర్త సార్' అని హెచ్చరించి గురవయ్య కూడా రంగంలోకి దిగాడు. జనప్రవాహంలో ప్రతివాడు మునక ఈతకొట్టాలని ప్రయత్నిస్తున్నవాడే అంటే జనంలో మునిగి బస్సులో తేలాలని ప్రతి ఒక్కడి వాంఛ. క్యూలు నవ్వని జనం తొక్కిసలాటలో ఎంతో కొంత ఆనందం అనుభవిస్తూ కుమ్ముకుంటున్నారు. బలవంతులు బస్సులోకి దొమ్ముకుపోతూంటే అర్భకులు చెరకు పిప్పిలా వెలుపలికి విసిరివెయ్యబడుతున్నారు.

చివరికి...

సర్వేశలింగం బస్సులో ప్రవేశించగలిగాడు.

కానీ ఎప్పటి మాదిరిగానే దురదృష్టం వెక్కిరించింది. నిర్లక్ష్యంగా వదులుగా పట్టుకున్నా కాష్ బాగ్ బంకలా అంటుకుని చేతుల్లో ఉంది.

వెనగ్గా ఎవరివో కేకలు.

"ఏమయ్యోయ్. నీ పాంటు జేబు చూసుకో. ఎవడో కోసేసాడు."

సర్వేశలింగం గుండెల్లో అణు ప్రేలుడు జరిగింది.

"అబ్బ ఏం తెలివిగా కోసాడండీ పాపం ఎంత పోయిందో ?"

అప్రయత్నంగా పాంటుజేబులోకి చెయ్యిపోనిస్తే... బైటకి తన్నుకొచ్చింది. పొడుగ్గా చీరేసిన పైనం బయటవేలు గల్లంతు.



"యింకా నయం. జేబుకొట్టి ఊరుకున్నాడు. చేతిలో కాష్ బాగ్ పోలేదు. అదృష్టం" ఎవరివో సానుభూతి వచనాలు.

'జేబు దొంగతనానికి కాష్ బాగ్‌లో డబ్బు గల్లంతుకీ సంబంధం ఏవిటి ? బాగ్‌లో సొమ్ము జేబులోకి రావాల్సిన అవసరం ఏవిటి ? రకరకాల ఆరాలు ! సస్పెన్షన్ ... తరువాత రికవరీ...లేక ఉద్యోగానికి ఉద్వాసన !...' సర్వేశలింగం యిక ఆలోచించలేక కేకలు వెయ్యక - వెయ్యలేక కక్కలేక మింగలేక కుప్పలా కూలిపోయాడు

గబుక్కున కూలిపోకుండా పట్టుకుని సమయానికి ఆదుకున్నాడు- ఐదువేలూ బావమరిది ద్వారా దాటవేయించిన ఆఫీసుప్యూన్ గురవయ్య-సర్వేశలింగం నాడి కనిపెట్టి అవకాశంకోసం ఎదురు చూస్తూన్న గురవయ్య,